నిరుపేదలకు తోడుగా..

- అండగా నిలుస్తున్న 'జగనన్న చేదోడు'
- 5,622 మందికి ప్రయోజనం
- ఖాతాల్లో మూడు విడత సొమ్ము జమ

మామిడికుదురు: సొంత షాపు కలిగిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జగనన్న చేదోడు' పథకం ఎంతో అండగా నిలుస్తోంది. దీని ద్వారా ఆ వర్గాల్లో అర్హులైన వారికి ప్రభుత్వం ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తోంది. ఈ పథకంలో భాగంగా లబ్ధిదారుల ఖాతాలకు మూడో విడత ఆర్థిక సహాయాన్ని ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. ఆయన ప్రవేశపెట్టిన ఈ పథకం తమకు ఎంతో అండగా నిలుస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో చాలా మంది అధికారంలోకి వచ్చినా.. ఏ ఒక్కరూ తమ గురించి పట్టించుకోలేదని, కానీ సీఎం జగన్ తమపై కరుణ చూపారని చెబుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో తమ జీవనోపాధి మార్గాలను మరింత మెరుగు పరచుకుంటున్నామని అంటున్నారు. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 5,622 మంది లబ్ధిదారులు జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధి పొందారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.5.62 కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది.

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
పి.గన్నవరం	1,662	1.66
రాజోలు	1,314	1.31
కొత్తపేట	2,646	2.64
మొత్తం	5,622	5.62



అమలాపురంలో లబ్ధిదారులకు జగనన్న చేదోడు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే చిట్టిబాబు

పెట్టుబడికి ఉపయోగిస్తున్నాను



జగనన్న చేదోడు పథకం ద్వారా మూడేళ్లుగా ప్రభుత్వ సహాయం పొందుతున్నాను. దీంతో మెటీరియల్ కొనుగోలు చేసుకుంటూ వృత్తి సాఫీగా కొనసాగిస్తున్నాను. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం నా వృత్తికి ఎంతో చేదోడుగా నిలుస్తోంది.

– కటికిరెడ్డి పెద్దిరాజు, టైలర్, పెదపట్నంలంక

గతంలో ఎన్నడూ ఇలా లేదు



బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న నాకు జగనన్న చేదోడు పథకం ద్వారా ఆర్థిక సహాయం అందింది. కుల వృత్తులు చేసుకునే మా లాంటి పేదలకు గతంలో ఎన్నడూ ఇటువంటి ప్రోత్సాహం అందలేదు.

– రామేశ్వరపు నాగేశ్వరరావు, నాయీ బ్రాహ్మణుడు, మామిడికుదురు

పేదలను ప్రభుత్వం ఆదుకుంది



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి వైఎ స్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఎంతో అండగా నిలిచారు. చాలా ఆనందంగా ఉంది. కుల వృత్తులు చేసుకునే కుటుంబాల్లో ప్రభుత్వం వెలుగులు నింపింది. – కొత్తపల్లి శ్రీనివాసరావు, లాండ్రీ షాపు, మామిడికుదురు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, విప్ జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

రావులపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పీఎంసీ చైర్మన్ గొలుగూరి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో కలసి రుడా చైర్మన్ షర్మిలారెడ్డి 250 పుస్తకాలను (స్టడీ మెటీరియల్) ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్టడీ మెటీరియల్‌ను కూడా విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, అత్యుత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తిమోతి ప్రకాష్‌రావు, జక్కంపూడి సత్యవతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, బాలుర హైస్కూల్ పీఎంసీ చైర్మన్ చిర్ల కనికిరెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ హరిప్రసాద్, హెచ్‌ఎంలు సువర్ణ కుమారి, ఎం.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షెడ్డులోకి చేరిన స్వామివారి రథం



షెడ్డులోకి చేరిన రథం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని రథాన్ని ఆలయ ప్రాంగణంలోని షెడ్డులోకి అగ్నికుల క్షత్రియులు, భక్తులు గురువారం చేర్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో సూపరింటెండెంట్ పి.విజయ సారథి, ఎస్సై అడపా ఫణిమోహన్ ఈ పనులను పర్యవేక్షించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గత నెల 28న రథసప్తమి రోజున గోవింద నామ స్మరణల మధ్య రథాన్ని షెడ్డు నుంచి మెరక వీధికి చేర్చిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 1న భీష్మ ఏకాదశి నాడు రథయాత్ర ముగిసిన పిమ్మట రథాన్ని పల్లపు వీధిలోని 16 కాళ్ల మండపం వద్ద ఉంచారు. తీర్థ మహోత్సవాలు పూర్తయినందున రథాన్ని తిరిగి షెడ్డులోకి చేర్చారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి–2 గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం ప్రారంభించారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ఆదిమూలం సూరయ్యకాపు, అయినపర్తి ఇందిరా ప్రియదర్శిని, నాయకులు పాల్గొన్నారు.

విచక్షణా రహితంగా ఎరువులు వాడవద్దు

మలికిపురం: వరిలో విచక్షణా రహితంగా ఎరువులు వాడవద్దని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ సూచించారు. విశ్వేశ్వరాయపురంలో ఏడో వారం పొలంబడి గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విషపూరిత ఎరువులు వాడకుండా ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంటల సాగుతో ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.రాకేష్, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం

మామిడికుదురు: దేవస్థానాల పాలక మండళ్లలో తమ సామాజిక వర్గానికి స్థానం కల్పించే దిశగా ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేయడం తమకు దక్కిన అరుదైన గౌరవమని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కాగితాలపల్లి నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లోని పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించారని చెప్పారు. దీనిపై ఆర్డినెన్స్ జారీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఇందుకు కృషి చేసిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఈఓ కుటుంబ సభ్యులకు పరామర్శ

మామిడికుదురు: గుండెపోటుతో మృతి చెందిన ఎంఈఓ కె.ప్రసాదరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శించారు. ప్రసాదరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించే ప్రసాదరాజు మృతి తీవ్రంగా కలచి వేసిందని సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెదపట్నంలంక మాజీ ఉప సర్పంచ్ గిడుగు జగపతి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆదుర్రుకు చెందిన జక్కంపూడి గాయత్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులను కూడా చిట్టిబాబు పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు ఉన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి

- పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- మాచవరంలో గడప గడపకూ..

అంబాజీపేట: 'జగనన్న ప్రతినిధులుగా మేమందరం మీ ముందుకు వచ్చాం.. ప్రభుత్వ పథకాలన్నీ మీకు అందుతున్నాయా.. సమస్యలేమైనా ఉన్నాయా.. మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మీ చల్లని ఆశిస్సులు మరోసారి జగనన్నకు అందించాలి' అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాచవరం గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందించడాన్ని ప్రజలందరూ గుర్తించాలని కోరారు. 'ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదిస్తే మీ బిడ్డల భవిష్యత్తును చక్కదిద్దే బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటారు' అని అన్నారు. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోందని, వాడకం నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నాగాబత్తులవారి కాలనీ వాసులు ఎమ్మెల్యేకు చెప్పారు. మురుగునీరు బయటకు వెళ్లేందుకు త్వరలో డ్రైనేజీలు నిర్మిస్తామని వారికి ఎమ్మెల్యే చిట్టిబాబు భరోసా ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు, నాయకులు మైలా ఆనందరావు, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీను, కోట సత్తిబాబు, అప్పన శ్రీను ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సంక్షేమ పథకాలతో సుపరిపాలన

- రాజోలు ఎమ్మెల్యే రాపాక
- కూనవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజోలు: సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. కూనవరం గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా పాలనా వ్యవస్థను ప్రభుత్వం తీసుకు వచ్చిందని చెప్పారు. ఎటువంటి వివక్ష, దళారుల బెడద లేకుండా సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నేరుగా జరుగుతోందని తెలిపారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక

రాష్ట్రంలో అమలు చేస్తున్న అనేక పథకాలు దేశవ్యాప్తంగా పేరొందాయని చెప్పారు. నాడు – నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, నూతన విద్యావిధానంతో రానున్న కాలంలో విద్యార్థులు విద్యపై మంచి పట్టు సాధిస్తారని అన్నారు. ఎమ్మెల్యే రాపాక, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజలను కూనవరం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, అడబాల నారాయణస్వామి, చెల్లింగి చినబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తీర్థ మహోత్సవం

మామిడికుదురు: మగటపల్లిలో శ్రీధనమ్మ, వనువులమ్మ వార్ల తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. భారీ ఊరేగింపుతో జరిగిన అమ్మవార్ల తిరుగు ప్రయాణంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

ఆలమూరు: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) కింద చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో 127 మంది బాలింతలు, గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలా తొమ్మిదిన క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ వైద్య సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు, పి.భవానీ శంకర్ కోరారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా పాల్గొన్నారు.

జగన్‌తోనే మాకు సముచిత స్థానం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రోజారమణి, శెట్టిబలిజ సంఘ నేతలు

- రోజా రమణికి ఏఎంసీ చైర్‌పర్సన్ పదవిపై హర్షం
- సీఎంకు రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం ధన్యవాదాలు

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర వ్యాప్తంగా శెట్టిబలిజలకు సముచిత స్థానం దక్కిందని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశం పేర్కొంది. రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా గుబ్బల రోజా రమణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో.. సంఘం నేతలు మలికిపురంలోని గుబ్బల బాబ్జీ నివాసం వద్ద గురువారం సమావేశమయ్యారు. రోజా రమణికి పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, శెట్టిబలిజల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ సంఘీయులకు ఎన్నో పదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. నియోజకవర్గ ఆనవాయితీని గౌరవిస్తూ ప్రభుత్వం రాజోలు ఏఎంసీ చైర్మన్ పదవిని తమ వర్గానికే ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రోజా రమణి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, రైతుల సంక్షేమానికి, ప్రభుత్వం లక్ష్యాల సాధనకు అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు గుబ్బల బాబ్జీ, ఎన్నారై డాక్టర్ గెద్దాడ నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, గుబ్బల కట్లయ్య, నాయకులు గుబ్బల రమేష్, కంచి వెంకట రమణ, కట్టా శ్రీనివాసరావు, గుబ్బల మనోహర్, గుత్తుల సాయి, కోళ్ళ వేణు ప్రసాద్, గుబ్బల వీర వెంకట సత్యనారాయణ, కడలి వీర వెంకట సత్యనారాయణ, కొప్పిశెట్టి లక్ష్మీ మంగతాయారు, బొంతు రాజగోపాలరావు, కడలి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఆ శాఖ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కొత్తపేట, ఏనుగుల మహల్, మందపల్లి, కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వివరించారు.

రావులపాలెంలో..

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా రావులపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు రవికుమార్ గురువారం తెలిపారు. రావులపాలెం, కొమరాజులంక, రావులపాడు తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వైభవంగా పంట జాతర

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో శ్రీ రావులమ్మ అమ్మవారి పంట జాతర గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా ఫిబ్రవరి నెలలో 15 రోజుల పాటు అమ్మవారిని పూజాఘటాలతో గ్రామంలో ఊరేగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పంటలు బాగా పండి, సిరులు కురిపించాలని కోరుతూ భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. కె.పెదపూడిలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి 20వ వార్షికోత్సవ ఏకాహం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏఐసీఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పాల్



అయినవిల్లి: ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సిరిపల్లికి చెందిన ఎస్.పాల్ ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం సెయింట్ పాల్ మార్టిన్ చర్చిలో గురువారం ఏఐసీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్ ఎన్నిక జరిగింది. ఆయనను జాతీయ అధ్యక్షుడు గద్దిపాటి విజయరాజు, రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, పలువురు పాస్టర్లు అభినందించారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

ఆలమూరు: చింతలూరులో నిర్మిస్తున్న బేతస్థ ప్రార్థన మందిరం (చర్చి) నిర్మాణానికి వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆలమూరులోని తన నివాసంలో వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి సమక్షంలో పాస్టర్ బుంగ శామ్యూల్‌కు ఈ మొత్తాన్ని గురువారం అందజేశారు.

కాంగ్రెస్ 'చేయిచేయీ కలుపుదాం'

మలికిపురం: లక్కవరంలో కాంగ్రెస్ నేతలు 'చేయీ చేయీ కలుపుదాం' కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీసీసీ సభ్యులు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు, చిలకపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ కరపత్రాల ఆవిష్కరణ

కొత్తపేట: ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రూపొందించిన 'మీకోసం భగవంతుడు ఇచ్చిన సందేశం' కరపత్రాలను ప్రముఖ అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వుడయార్, బ్రహ్మకుమారీస్ అమలాపురం శాఖ ఇన్‌చార్జి నందిని ఆవిష్కరించారు. స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి మందిరంలో బ్రహ్మకుమారీస్, మందిర కమిటీ ఆధ్వర్యాన గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడానికి, ప్రజలను సన్మార్గంలో నడిపించడానికి బ్రహ్మకుమారీస్ శాఖల ద్వారా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా అవసరమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతనకు కేటాయించాలన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శిల్పి రాజ్‌కుమార్, నందిని

నందిని మాట్లాడుతూ, భగవంతుడు ప్రసాదించిన అందమైన జీవితాన్ని దుర్వ్యసనాలకు బానిసై పాడు చేసుకోకూడదని, నేను, నాది అనే సంకుచిత భావన వదిలి ఈశ్వరుని పట్ల విధేయత కలిగి ఉండాలని అన్నారు. కరపత్రాన్ని తొలుత స్థానిక వైద్యుడు డాక్టర్ కాశిన గేయానంద శేషుబాబుకు అందజేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్య రక్షణ

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ కిట్లను సద్వినియోగం చేసుకుని, సంపూర్ణ ఆరోగ్య రక్షణ పొందాలని, రక్తహీనతను నివారించుకోవాలని కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి కోరారు. ఆలమూరులోని ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని పాల్గొన్నారు. పౌష్టికాహారం ఆవశ్యకత, చిన్నారులకు నిర్ణీత సమయంలో అందించాల్సిన టీకాలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వైఎస్సార్ సీపీ నేతలు నాతి కుమార్‌రాజా, చల్లా భూషణం, వాసంశెట్టి సాయిబాబా సమకూర్చిన చీరలు, రవికలు, పండ్లు, పూలు, పసుపు కుంకులను గర్భిణులకు అందజేసి, సీమంతాలు నిర్వహించారు. అక్షింతలు వేసి ఆశీర్వదించారు. గ్రామ సచివాలయ మహిళా కార్యదర్శి ఎస్.నీలిమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్వాకు కరెంటు సబ్సిడీ అమలు చేయాలి

సఖినేటిపల్లి: గతంలో మాదిరిగానే ఆక్వా జోన్ పరిధిలోని చెరువులన్నింటికీ యథాతథంగా సబ్సిడీ అమలు చేయాలనే డిమాండుతో ఆక్వా జోన్ పరిధిలోని రైతులు గురువారం సఖినేటిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కరెంటు బిల్లులు వెంటనే తగ్గించాలని, ఆక్వా రైతులను ఆదుకోవాలని, సాగు చెరువులకు సబ్సిడీని వెంటనే పునరుద్ధరించాలని నినదించారు. తహసీల్దార్ వై.రామకుమారికి, విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులకు సఖినేటిపల్లి మాజీ సర్పంచ్ జంపన బుజ్జిరాజు వినతిపత్రాలు అందజేశారు. బుజ్జిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం ఆక్వా సాగుకు యూనిట్‌కు రూ.1.50 సబ్సిడీ అమలు చేసి ఊరట కలిగించిందని, అయితే కొత్తగా చేసిన సర్వే ఆధారంగా ఆక్వా జోన్ పరిధిలోని చెరువులన్నింటికీ ఈ నెల సబ్సిడీ తీసివేశారని అన్నారు. దీంతో సబ్సిడీ లేకుండానే కరెంటు బిల్లులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్సిడీ పోనూ మిగిలిన బిల్లు మాత్రమే కట్టించుకునేలా చూడాలని కోరారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు రామకుమారికి వినతిపత్రం ఇస్తున్న బుజ్జిరాజు

నదీ పాయలలో అడ్డుకట్టలు తొలగించాలి

పి.గన్నవరం: పెదకందాలపాలెం, శివాయలంకల నుంచి ఇసుక, మట్టి తరలించేందుకుగాను నదీపాయలపై అడ్డుగా నిర్మించిన కట్టలను తొలగించాలని కోరుతూ మత్స్యకార నాయకులు గురువారం ఆందోళన నిర్వహించారు. నదీపాయల మధ్య అడ్డుకట్టల వలన పడవలు తిరిగే అవకాశం లేక, చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు తక్షణమే తమకు న్యాయం చేయాలని కోరారు.

పెదకందాలపాలెం ర్యాంపు వద్ద జరిగిన ఈ ఆందోళనలో నియోజకవర్గ మత్స్యకార సంఘం అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు, నాయకులు కొపనాతి సీతారామస్వామి, పెమ్మాడి మారుతీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రంతో పురుగుల నివారణ

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయంలో బ్రహ్మాస్త్రంతో పంటలను నాశనం చేసే పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ నాగవరపు శ్రీనివాసరావు, కొప్పిశెట్టి ఆనందప్రసాద్ అన్నారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో బ్రహ్మాస్త్రం పురుగుల మందు తయారీపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేపాకులు 6 కేజీలు, జిల్లేడు ఆకులు 4 కేజీలు, బొప్పాయి ఆకులు 4 కేజీలు, జామ ఆకులు 4 కేజీలు, ఉమ్మెత్తాకులు 4 కేజీల చొప్పున 50 లీటర్ల ఆవు మూత్రంలో మరిగించాలన్నారు. 48 గంటల తరువాత ఈ బ్రహ్మాస్త్ర కషాయాన్ని పంటలపై వినియోగిస్తే పురుగులు చనిపోతాయని చెప్పారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో గర్భిణులకు గురువారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రారంభించారు. వై.కొత్తపల్లి వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు, సభ్యులు నల్లా రాధాకృష్ణ, ఫణికుమార్ ఆధ్వర్యాన గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, డాక్టర్ ప్రత్యూష, సర్పంచ్ తోరం వీవీ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు. అలాగే నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి వై.శ్రీవల్లి ఆధ్వర్యాన గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాలకొల్లు బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యాన గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. సీహెచ్‌ఓ ఎం.రవికుమార్, ఎంపీహెచ్‌ఓ ఎ.నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుది దశకు జగనన్న భూరక్ష, భూహక్కు పథకం

ఆలమూరు: మండలంలోని మోదుకూరు, చింతలూరు గ్రామాల్లో జగనన్న భూరక్ష, భూహక్కు పథకం తుది దశకు చేరుకుంది. రెవెన్యూ శాఖ సరిహద్దు రాళ్ల సరఫరా చేయడంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పెంటపాటి శ్యామల, మార్గని కరుణ పర్యవేక్షణలో గుర్తించిన హద్దుల్లో రాళ్లు పాతనున్నట్లు వీఆర్‌ఓ డి.అమ్మాజీ తెలిపారు.

ఘన సత్కారం

ఆలమూరు: ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత గుణ్ణం రాంబాబుకు ఘన సత్కారం జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ పింఛన్ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు గట్టి రామారావు గురువారం గుమ్మిలేరులోని సర్పంచ్ రాంబాబు నివాసానికి వచ్చారు. దుశ్శాలువ కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంక వద్ద రైల్వే పనుల నిమిత్తం ఉంచిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అయినవిల్లిలంకకు చెందిన దాసరి శ్రీను, శానపల్లిలంకకు చెందిన ముంగడ వెంకటకృష్ణకు చెందిన ట్రాక్టర్లతో చాలా కాలంగా ఈ ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై పోలీసులు నిఘా పెట్టి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఈ ట్రాక్టర్లను సీజ్ చేసి, తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు

అంబాజీపేట: ఈ–క్రాప్ నమోదు రైతులకు మేలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ఇసుకపూడి, చిరతపూడి, గంగలకుర్రు తదితర గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ–క్రాప్ నమోదు వల్ల ఎరువుల నుంచి పంట విక్రయించే వరకూ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అందరూ ఈ నెల 20 లోగా పంట నమోదు చేయించుకోవాలన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు అరికట్టాలి

కొత్తపేట: ఆలమూరు మండలం జొన్నాడ, చొప్పెల్ల గ్రామాల్లోని ప్రభుత్వ పట్టా భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్‌డీఓ కార్యాలయంలో గురువారం వినతిపత్రం సమర్పించారు.